క్లుప్తంగా

27న హెడ్‌పోస్టాఫీసులో డాక్ అదాలత్

తెనాలిఅర్బన్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్తపేటలోని తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈ నెల 27న డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సేవలకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే 27వ తేదీ ఉదయం 11 గంటలకు పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. హాజరు కాలేని వారు తమ ఫిర్యాదులను లెటర్ పై డాక్ అదాలత్ అని రాసి ఈ నెల 25 లోపు తమ కార్యాలయానికి పంపాలని సూచించారు.

26న హుండీ లెక్కింపు

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థాన హుండీ లెక్కింపు ఈనెల 26న నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల భక్తులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.

విజయకీలాద్రిపై జ్యేష్ఠాభిషేకం



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శుక్రవారం జ్యేష్ఠాభిషేక మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన జీయర్‌స్వామి మంగళాశాసనములతో జ్యేష్ఠమాసం, జ్యేష్ఠ నక్షత్రం సందర్భంగా శ్రీ వెంకటేశ్వరస్వామికి ఉదయం 9 గంటలకు జ్యేష్ఠాభిషేకం నిర్వహించామని తెలిపారు. పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో స్వామి వారికి అభిషేకం చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజయకీలాద్రి వేద పండితులు, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన



పెదకాకాని: విద్యావంతులైన బాలల వల్ల మెరుగైన సమాజం ఏర్పడుతుందని గ్రామ సర్పంచి ఆలా సాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని కొప్పురావూరు గ్రామంలో శుక్రవారం చైల్డ్ రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్ – క్రాఫ్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక మాసాన్ని పురస్కరించుకొని బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ఆడియో ప్రకటన ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా బాలలను బాగా చదివించాలని, తల్లిదండ్రులకు బాలలందరినీ స్కూలుకి పంపించే విధంగా అవగాహన కల్పించాలని బాలల హక్కుల చట్టాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ జి.వెంకట్ మాట్లాడుతూ బాల కార్మికత్వాన్ని అంతం చేయడం అందరి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. 14 – 18 సంవత్సరాల మధ్య ఉన్న బాలలను ప్రమాదకరమైన సంస్థలో నియమించటం నిషేధించబడిందని తెలిపారు. ఈ సమావేశంలో హైస్కూల్ హెచ్ఎం డీఐ ప్రభాకర్, అంగన్వాడి వర్కర్లు కోటేశ్వరమ్మ, నాగలక్ష్మి, ఆశ వర్కర్లు గ్రామ పెద్దలు, బాలల పంచాయతీ బాలలు పాల్గొన్నారు.

రేపు కామన్ సివిల్ కోడ్‌పై సదస్సు

నగరంపాలెం: సమాలోచన (మేధావుల వేదిక) గుంటూరు ఆధ్వర్యంలో ఈనెల 23న అమరావతి రోడ్డులోని హిందూ కళాశాల ఆఫ్ ఫార్మసీ సమావేశ మందిరంలో 'కామన్ సివిల్ కోడ్' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు అన్నా నందకిశోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు రాక లోకం చీఫ్ ఎడిటర్ రాక సుధాకరరావు ముఖ్య వక్తగా వ్యవహరిస్తారన్నారు. టొబాకో బోర్డు చైర్మన్ సీహెచ్. యశ్వంత్, తులసి సీడ్స్ ఎండీ తులసి యోగేష్‌చంద్ర ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారని ఆయన పేర్కొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

పట్నంబజారు: వృద్ధురాలి మెడలో గుర్తు తెలియని ఓ మహిళ గొలుసు లాక్కుని పరారైన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. చౌత్రా సెంటర్‌కు చెందిన నీలిశెట్టి శేషారత్నం అనే వృద్ధురాలు శుక్రవారం మధ్యాహ్నం ఇంటి బయట కూర్చుని ఉన్నారు. ఈ సమయంలో గుర్తు తెలియని ఓ మహిళ అకస్మాత్తుగా శేషారత్నం వద్దకు వెళ్లి ఆమె మెడలోని గొలుసు లాక్కుని పరారైంది. బాధితురాలు లాలాపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

యోగాతో పరిపూర్ణ జీవితం

- సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్
- పట్టణంలో పలు చోట్ల యోగా దినోత్సవం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్



ఆదర్శ స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తెనాలిఅర్బన్: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను గంగానమ్మపేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి వైశ్య విద్యానిధి హాస్టల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు యోగ చేయడం వలన ఒత్తిడి దూరమవుతుందని చెప్పారు. నిత్యం యోగా చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారతారని వివరించారు. అనంతరం యోగా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావు, ఆర్యవైశ్య నాయకులు కొత్తమాసు నాగేంద్రం, సుగ్గుల వెంకటప్పయ్య, గోనుగుంట్ల శ్రీనివాసరావు, ఎస్వీయోగ కన్వీనర్ ముద్దాబత్తుని రమణయ్య పాల్గొన్నారు.

✦ శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో చెంచుపేటలోని ఆదర్ష ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కన్వీనర్ ముద్దాబత్తుని రమణయ్య యోగాపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కె.బాపిలాల్, అనూష, తేజ, గోపాలరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

✦ బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. హార్ట్ ఫుల్ నెస్ సంస్థ శిక్షకులు ఎం.ఆర్.కె.మూర్తి, ఎం.శ్రీనివాసరావులు యోగా ఆవశ్యకతను తెలియజేసి శిక్షణ ఇచ్చారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ అధికారి కె.కల్యాణ్ చక్రవర్తి, వై.ఫణీకృష్ణ, పి.భార్గవి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

✦ బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. యోగా గురువు నాగళ్ల లావణ్య విద్యార్థులకు పలు ఆసనాలు నేర్పించారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

✦ జయప్రకాష్‌నగర్‌లోని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో యోగా గురువు నాగ వెంకటేశ్వరరావు విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. కార్యక్రమంలో ఏజీఎం కె.వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్ సీహెచ్.ప్రతిభ, ఆర్‌ఐ పూర్ణిమ, ప్రిన్సిపల్ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

✦ జేఎంజే కళాశాలలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో యోగా గురువు కొల్లిపర కుమారస్వామి విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అమూల్ మేరి, అధ్యాపకులు డాక్టర్ అరుణ సుజాత, డాక్టర్ నిర్మల జ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం

తెనాలిరూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక కొత్తపేటలోని కోర్టు ఆవరణలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 11వ అదనపు జిల్లా జడ్జి డి. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతిరోజు యోగాసనాలు వేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం వృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరు యోగా నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా కిషోర్ గురూజీ అందరి చేత ఆసనాలు వేయించారు. న్యాయమూర్తులు పవన్ కుమార్, రాజశేఖర్, వివేక్‌వర్ధన్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బేతాళ ప్రభాకర్, హరిదాసు గౌరీ శంకర్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్స్, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న న్యాయ మూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది



ఏఎస్ఎన్ కళాశాలలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ శిక్షకుడు మూర్తిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్ వెంకటరమణ



జేఎంజేలో యోగా చేస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

వెస్ట్‌బెర్రీ స్కూల్‌లో..

స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రీ స్కూల్‌లో అంతర్జాతీయ యోగా, సంగీత దినోత్సవాలను నిర్వహించారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా సులువైన సాధనమని స్కూల్ ప్రిన్సిపల్ టీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. విద్యార్థులు యోగాసనాలు వేసి సంగీత వాయిద్యాలను వాయించారు. స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.



యోగాసనాలు వేస్తున్న వెస్ట్‌బెర్రీ విద్యార్థులు



నారాయణ స్కూల్‌లోయోగా చేస్తున్న ఏజీఎం వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్ ప్రతిభ



నెహ్రూనికేతన్ స్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థులు

ఘనంగా అంతర్జాతీయ సంగీత దినోత్సవం



సంకీర్తనలు ఆలపిస్తున్న లక్ష్మీ సునీత

తెనాలిఅర్బన్: అంతర్జాతీయ సంగీత దినోత్సవ వేడుకలను రామలింగేశ్వరపేటలోని శ్రీ సాయిరామ్ సంగీత కళాశాలలో శుక్రవారం వరుల లక్ష్మీ సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. లక్ష్మీ సునీత విఘ్నేశ్వర ప్రార్థనతో సంకీర్తన ప్రారంభించారు. సంగీత జ్ఞానం, ధాన్యసి రాగం, ఆదితాళం వంటి వాటిని గానం చేశారు. కార్యక్రమంలో కీబోర్డు ప్లేయర్ పార్వతి, మృదంగ విద్వాంసులు కానూరు వెంకట రామకృష్ణ, శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు, సునీల్‌కుమార్, పరుచూరి సుబ్బారావు, వీఎల్.నరసింహారావు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

తెనాలిఅర్బన్: వీఎస్సార్ కళాశాల సమీపంలోని హైకాస్ పార్కులో ఉన్న నాలుగు పాత ఎయిర్ వాల్స్ స్థానంలో కొత్త వాటిని శనివారం ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు నేపథ్యంలో ఆదివారం మూడో వార్డు, 10వ వార్డులోని సిద్ధార్థ కాలనీ, కవిరాజా పార్కు ఏరియా, నందులపేట, గాంధీనగర్, బీసీ కాలనీ, కొత్తపేట, నాజరపేటలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా సహకరించాలని కోరారు.

క్రీడాకారుడు మొహిద్దీన్‌కు ఆర్థిక సాయం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఛండీగఢ్‌లోని పంచకులలో ఈ నెల 25 నుంచి జరగనున్న జాతీయ అంతర్ రాష్ట్రాల అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనే షేక్ మొహిద్దీన్‌కు సహస్ర ఆర్థో అండ్ న్యూరో క్లినిక్ అధినేత డాక్టర్ ఎం.శివకుమార్ ఆర్థిక చేయూత నందించారని అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొహిద్దీన్ ఇటీవల ఫెడరేషన్ కప్‌లో కాంస్య పతకం సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. డాక్టర్ శివకుమార్ క్రీడాకారులకు ఎప్పుడూ అండగా నిలుస్తున్నారని తెలిపారు.

ఆగని ఆక్రమణల పర్వం

లాం(తాడికొండ): ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసినా తాడికొండ మండలం లాం గ్రామంలో భూముల ఆక్రమణకు అడ్డుకట్ట పడిన దాఖలాలు కనిపించడం లేదు. కొండ పోరంబోకు, పలు ప్రభుత్వ భూములను గ్రామానికి చెందిన కొందరు ఇష్టారీతిగా ఆక్రమించి నకిలీ బీ ఫారం సర్టిఫికెట్లతో అమ్ముకొని రూ. కోట్లు సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తుల నుంచి పలు ఫిర్యాదులు వెళ్లాయి. గతంలో ఆయా అక్రమ నిర్మాణాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ అడ్డుకట్ట పడిన దాఖలాలు లేవు. మరికొంతమంది గుట్టుచప్పుడు కాకుండా రూ.లక్షల విలువైన భూములను ఆక్రమిస్తుండటంతో అధికారులు ఎట్టకేలకు హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే లాం గ్రామంలో కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం అయిపోగా... మిగిలిన కొద్దిపాటి భూమి అయినా అధికారులు కాపాడుతారేమో చూడాలి.



హెచ్చరిక బోర్డు పెడుతున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు

నీకింత.... నాకెంత అనే చందంగా సాగుతున్న ఈ వ్యవహారంలో ఇప్పటికే రెవెన్యూ శాఖకు చెందిన ఓ అధికారి నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు నివేదిక పూర్తయినట్లు సమాచారం. అతనితోపాటు గుట్టు చప్పుడు కాకుండా చేతులు కలిపి అమ్ముకొని సొమ్ము చేసుకున్న కేటుగాళ్లపై ఎంతమేరకు చర్యలు తీసుకుంటారనేది అంతుబట్టని ప్రశ్నగా మారింది.

మహిళా పోలీసులకు న్యాయం చేయాలని వినతి

తాడేపల్లి రూరల్: రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 15 వేల మంది మహిళా పోలీసులకు న్యాయం చేయాలని ఏపీ విలేజ్ వార్డ్ సెక్రటేరియట్ మహిళా పోలీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు దుర్గం మధులత కోరారు. ఈ మేరకు శుక్రవారం హైకోర్టు అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌ను ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. నూతనంగా నియమితులైన శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం చేయాలని విన్నవించారు. మహిళా పోలీసులు ఎదుర్కొంటున్న కోర్టు కేసు విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అమ్ముల రాధిక, గుంటూరు జిల్లా అడిషనల్ జనరల్ సెక్రటరీ తిరందాసు గీతాపావని తదితరులు పాల్గొన్నారు.



దమ్మాలపాటి శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్న దుర్గం మధులత

వేధింపుల వైద్యుడి నుంచి రక్షణ కల్పించండి

వైద్య ఆరోగ్య శాఖ మహిళా సిబ్బంది వినతి

కొల్లూరు : మహిళా వైద్య సిబ్బందిపై పీహెచ్‌సీ వైద్యాధికారి లైంగిక వేధింపుల ఫిర్యాదులపై వైద్యశాఖ జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల వైద్య సిబ్బందిలో ఆందోళన పెల్లుబికుతోంది. కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేసిన దావులూరి రవిబాబు వైద్య సిబ్బందికి అసభ్య పదజాలంతో కూడిన మెసేజీలు పంపడంతో పాటు లైంగిక వేధింపులకు గురి చేస్తుండటంతో గత ఏప్రియల్‌లో మహిళా వైద్య సిబ్బంది జిల్లా ఉన్నతాధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. మహిళా సిబ్బంది ఫిర్యాదుపై ఇప్పటి వరకు ఉన్నతాధికారులు ఎటువంటి విచారణకు ఆదేశించక పోవడంతో తిరిగి వైద్యాధికారి రవిబాబు బెదిరింపులకు పాల్పడుతూ సిబ్బందిని భయ భ్రాంతులకు గురి చేస్తున్నాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పలువురు మహిళా సిబ్బందిని లైంగిక వేధింపులకు గురి చేసిన వైద్యాధికారిని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు రేపల్లె డిప్యుటేషన్‌పై పంపించి మమ అనిపించారు. వైద్యశాలలో పనిచేస్తున్న సిబ్బందికి ఫోన్‌లు చేసి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తనను ఎవ్వరూ ఏమి చేయాలేరని అనటంతో మహిళా వైద్య సిబ్బంది ఆందోళనకు కారణంగా మారింది. వీటికి తోడు డీఎంహెచ్‌ఓ విజయమ్మ సైతం ఇటీవల కొల్లూరు పీహెచ్‌సీకి వచ్చి వైద్యాధికారి రవిబాబుకు వత్తాసు పలకటం పట్ల ఉద్యోగులు వాపోతున్నారు. వైద్యాధికారి వ్యవహారంపై వైద్య సిబ్బంది టీడీపీ నాయకులను ఆశ్రయించడంతో వైద్యశాలలో ఆయన వ్యవహారంపై టీడీపీ, జనసేన నాయకులు శుక్రవారం వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మహిళా సిబ్బంది పట్ల అనుచితంగా వ్యవహరించిన వైద్యాధికారిపై విచారణలో జాప్యం పట్ల టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ డీఎంహెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణం విచారణ జరిపి చర్యలు చేపట్టాలని లేని పక్షంలో పీహెచ్‌సీ వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచి దూళిపూడి కృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు బొందలపాటి చలమయ్య ఉన్నారు.



కొల్లూరు పీహెచ్‌సీలో వైద్యురాలిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న నాయకులు

శ్రీవారికి చందన అలంకారం



నగరంపాలెం: స్థానిక లాలాపేటలోని శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ఐదో రోజుకి చేరాయి. శ్రీ స్వామి వారికి చందనం (గంధంతో) అలంకారం చేశారు. ఉదయం నిత్య హోమం, బలిహరణ, గరుడ వాహనంపై గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. 108 కలశాలతో అష్టోర కలశ స్నపన అభిషేకాలు జరిగాయి. రాత్రి పుర వీధుల్లో రథోత్సవం అట్టహాసంగా కొనసాగింది. మహిళల కోలాటం అలరించింది. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శ్రీ జగన్నాథ, శ్రీ ఆంజనేయ, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం అర్చకులు ఆర్.టి. ఆర్.వి.ప్రసాద్, శ్రీనివాసాచార్యులు, మురళీ, చంద్రకుమార్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రత్యేక ఓపీ

గుంటూరు మెడికల్: సమాజంలో మంచి గుర్తింపు వచ్చే విధంగా ట్రాన్స్‌జెండర్స్ మసలుకోవాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ సూచించారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ప్రైడ్ మంత్‌లో భాగంగా వాలంటరీ హెల్త్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాన్స్‌జెండర్స్‌కు ఉచిత వైద్య సలహాలతో పాటు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ జీజీహెచ్‌లో ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రత్యేకమైన ఓపీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం ట్రాన్స్‌జెండర్స్‌తో కలసి సూపరింటెండెంట్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, మానసిక వైద్యవిభాగాధిపతి డాక్టర్ ఉమాజ్యోతి, ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగాధిపతి డాక్టర్ సుమితా శంకర్, వీహెచ్ఎస్ రీజినల్ కో–ఆర్డినేటర్ బి.అపర్ణ, డాక్టర్ చంద్రశేఖరన్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోండి

జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: ల్యాబ్ టెక్నీషియన్లు తమ నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్‌లతో తెనాలి పట్టణంలోని అసిస్టెంట్ మలేరియా అధికారి కార్యాలయంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. మైక్రోస్కోప్ ద్వారా మలేరియా వ్యాధి కారక క్రిమిని, మలేరియాలోని వివిధ రకాలను ఎలా గుర్తించవచ్చో ప్రయోగాత్మకంగా వివరించారు. ల్యాబ్ టెక్నీషియన్‌లకు పునశ్చరణ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు ల్యాబ్ టెక్నీషియన్స్ బెన్నీ, తెనాలి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్స్ శ్రీ విద్య, ధనలక్ష్మి, సుధీర్, కలాకర్ గుప్తా, శివకృష్ణ, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురళీకృష్ణ సుబ్బరాయణం

మాతాశిశు మరణాలు అరికట్టేందుకు కృషి

ఫిరంగిపురం: మాతాశిశు మరణాలు అరికట్టేందుకు ఆరోగ్యసిబ్బంది కృషి చేయాలని డీపీహెచ్ ఎన్‌వో కె. శాంతకుమారి అన్నారు. మండల కేంద్రంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు రక్తహీనత పరీక్షలు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. తర్వాత శాంతకుమారి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గర్భిణులకు రక్తపరీక్షలు చేసి తగిన మందులు, ఆహారం తీసుకునేలా వారికి సలహాలు ఇస్తున్న తీరును పరిశీలించినట్లు తెలిపారు. జననీ సురక్షా యోజన, ప్రధాన మంత్రి మాతృ యోజన వంటి ప్రయోజనాలు అందిన తీరును తెలుసుకున్నట్లు చెప్పారు. అనంతరం సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులకు రక్తనమూనా పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఆర్‌సీహెచ్ రిజిస్టర్లు, స్కూల్ హెల్త్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఏఎన్ఎంల వద్ద ఆర్‌సీహెచ్ ఐడీ, అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులకు సంబంధించి ఐడీ నెంబర్లు పోల్చి చూశారు. కార్యక్రమంలో డీపీవో ఎస్ హెచ్ఎం సైమన్‌రాజు, హెచ్‌వీ షేక్, ఎం. వహీద, టెక్నికల్ అసిస్టెంట్ షరీఫ్, వైద్యులు పి. ఎస్తేరురాణి, శ్వేత, సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌వో అమృతరాణి, ఏఎన్ఎంలు లావణ్య, భారతీజ్యోతి, మాబు, ఆంథోనిరాణి, అరుణ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు

సచివాలయ సెక్రటరీలు అందుబాటులో ఉండాలి

కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్

మంగళగిరి : సచివాలయ సెక్రటరీలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్పొరేషన్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ అన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. సచివాలయ సెక్రటరీలు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య పనులతోపాటు తాగునీటి సమస్యలపై కూడా దృష్టి పెట్టి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి ఆయా వార్డుల్లో పర్యటిస్తూ పరిష్కరించాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది, అధికారులు ఉన్నారు.



పట్టణంలో పర్యటిస్తున్న నిర్మల్ కుమార్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత



నెహ్రూనగర్: చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక మాసాన్ని పురస్కరించుకుని 21వ డివిజన్ కొండా వెంకటప్పయ్య కాలనీలో శుక్రవారం ఆటోల ద్వారా ఆడియో ప్రచారం చేస్తూ ప్రజలకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ జి. వెంకట్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను అంతం చేయడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న బాలల్ని పనిలో పెట్టుకోరాదని తెలిపారు. 14 నుంచి 18 సంవత్సరాల మధ్య ఉన్న వారిని ప్రమాదకరమైన సంస్థలు, ప్రదేశాలలో నియమించడం నిషేధించబడిందని చెప్పారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల బాలలు శారీరకంగా, మానసికంగా, లైంగికంగా ఇబ్బందులకు గురవుతారన్నారు. బాలల్ని పనిలో పెట్టుకుంటే ప్రభుత్వం జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తుందని తెలిపారు. ఎవరైనా బాల కార్మికులను గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబర్ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా 18001027222కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు.